ఆట.. అప్పు.. ఆత్మహత్య



కుటుంబాలను రోడ్డున పడేస్తున్న క్రికెట్

బెట్టింగ్ ఊబిలో కూరుకుపోతున్న యువత

జిల్లాలో ఇటీవల నలుగురి బలవన్మరణం

వందలాది మందికి రూ.లక్షల్లో అప్పులు

● అనంతపురం నగరానికి సమీపంలో ఉండే ఓ నియోజకవర్గ పరిధిలో ఓ కానిస్టేబుల్ కుమారుడు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడి రూ.లక్షల్లో నష్టపోయాడు. భారీగా అప్పులు చేశాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. ఆ యువకుడు పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న తమ బిడ్డను బతికించుకునేందుకు తల్లిదండ్రులు చివరిదాకా పోరాడారు. బెంగళూరు నగరంలోని ఓ ఖరీదైన ఆస్పత్రిలో మూడు వారాలపాటు చికిత్స చేయించారు. రూ.లక్షలు వెచ్చించారు. అయినా ఫలితం లేకపోయింది. ఈ ఐపీఎల్ సీజన్ ఆరంభానికి కాస్త ముందు జరిగిన దారుణం ఇది.

● యాడికి మండల కేంద్రానికి చెందిన ఓ చేనేత కార్మికుడు బెట్టింగ్‌కు బానిస అయ్యాడు. అప్పులపాలై.. వ్యసనాలకు, మద్యానికి అలవాటుపడ్డాడు. ఆయన భార్యకు ఏం చేయాలో తోచలేదు. చేనేత కార్మికుల జీవితాలు ఎంత దుర్భరంగా ఉంటాయో తెలియంది కాదు. అది చాలదన్నట్లు బెట్టింగ్ తోడైంది. కుటుంబ పరిస్థితి గురించి భర్తకు వివరించింది. మార్చుకోవాలని ప్రయత్నించింది. కానీ ఫలించలేదు. దిక్కుతోచని స్థితిలో ఆమె కన్న బిడ్డల ఎదుటే ఉరి వేసుకుంది.

● పరిగికి చెందిన ఓ యువకుడు గత ఏడాది ఐపీఎల్‌లో రూ.3లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ యేడాది ఏప్రిల్ మొదటి వారం వరకు బెట్టింగ్ కాశాడు. అప్పులు పెరిగిపోవడంతో చేసేదిలేక రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ బెట్టింగ్ గురించి ప్రస్తావించకుండా, ఆన్‌లైన్ గేమ్‌ల జోలికి వెళ్లవద్దని తన షర్ట్ మీద, కాగితం మీద రాసి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు.

అనంతపురం క్రైం/హిందూపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ ముగిసింది. మ్యాచ్‌లలో కొన్ని జట్లు గెలిచాయి.. కొన్ని ఓడిపోయాయి. సీజన్ విజేతగా ఓ జట్టు నిలిచింది. గెలిచినా.. ఓడినా.. ఆటలో పాల్గొన్నోళ్లకు భారీగా ఆదాయం సమకూరింది. కానీ, ఈ ఆట మాయలో పడి చాలా జీవితాలు నాశనమయ్యాయి. ఐపీఎల్ అనే కాదు.. క్రికెట్ మ్యాచ్‌లు ఎక్కడ జరిగినా, ఏ దేశాలు పోటీ పడుతున్నా.. ఆటకంటే ఎక్కువగా బెట్టింగ్ గురించే చర్చ జరుగుతుంది. క్రీడా స్ఫూర్తి.. ఉల్లాసం.. ఉత్సాహం కోసం కోసం చూడాల్సిన ఆటను జూదంగా చూస్తున్నారు. కూలి పనులు చేసుకునేవారి నుంచి ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు.. ఇలా అన్ని వర్గాలవారినీ బెట్టింగ్ ఉచ్చులోకి లాగేస్తున్నారు. మిగిలిన మ్యాచ్‌లతో పోలిస్తే.. ఐపీఎల్‌లో బెట్టింగ్ పతాక స్థాయిలో ఉంటుంది. సీజన్ ఆరంభం నుంచి అంతం వరకూ మైదానంలో జరిగే ఆట ఒకటైతే.. జనం బతుకులతో ఆడే ఆట మరొకటి. అక్కడ పరుగులు వస్తుంటాయి.. ఇక్కడ ఆస్తులు పోతుంటాయి. అక్కడ వికెట్లు పడుతుంటాయి.. ఇక్కడ శవాలు లేస్తుంటాయి. కుటుంబాలు రోడ్డున పడుతున్నా, యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, ఆస్తులు అమ్ముకుంటున్నా, అప్పులపాలై ఊర్లు విడుస్తున్నా అధికారులకు పట్టడం లేదు.. జనంలో (మిగత 7వ పేజీలో..)



దొడ్డిదారిలో స్పౌజ్..!

టీచర్ల బదిలీల్లో అడ్డగోలుతనం

● 31న రిటైరైన ఉద్యోగి ● స్పౌజ్ పాయింట్ల కోసం ఆయన భార్య యత్నాలు ● ఫిర్యాదు చేసినా... తొలగించని అధికారులు ● కలెక్టర్, కమిషనర్ హెచ్చరికలు బేఖాతరు ● గతంలో వాడుకున్న వారు.. మళ్లీ ప్రయత్నాలు ● కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు



అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్న టీచర్లు

అనంతపురం విద్య, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో కొందరు టీచర్లు దొడ్డిదారిలో వెళ్లేందుకు యత్నిస్తున్నారు. స్పౌజ్‌ను దుర్వినియోగం చేసి, అదనపు పాయింట్లు పొంది లబ్ధిపొందాలని చూస్తున్నారు. కొందరు టీచర్లు.. భర్త రిటైరైనా.. స్పౌజ్ వాడుకోవాలని చూస్తున్నారు. మే 31న రిటైరైన ఉద్యోగుల భార్యల్లో కొందరు స్పౌజ్ పాయింట్ల కోసం యత్నిస్తున్నారు. మరికొందరు రెండు, మూడేళ్ల కిందట వాడినా.. మళ్లీ పొందే ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్పౌజ్, ఇతర ప్రిఫరెన్షియల్ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవంటూ మొన్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. తాజాగా విద్యాశాఖ కమిషనర్ సైతం హెచ్చరించారు. అయినా.. కొందరు టీచర్లు అడ్డగోలుగా స్పౌజ్ వాడకానికి వెనకాడటం లేదు.

31న భర్త రిటైరైనా.. స్పౌజ్ వాడకం

గుంతకల్లు డివిజన్‌లోని ఒక మండలంలో పనిచేసే ఓ స్కూల్ అసిస్టెంట్ భర్త గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారని సమాచారం. సదరు మహిళా టీచర్ స్పౌజ్ పాయింట్ల కోసం స్పౌజ్ పెట్టుకున్నట్లు తెలిసింది. సదరు టీచర్‌కు స్టేషన్, సర్వీస్ పాయింట్లతోపాటు, ఈ దొడ్డిదారిలో వచ్చిన స్పౌజ్ పాయింట్లు మరో 5 వేసినట్లు తెలిసింది. సుమారు 40 వరకూ పాయింట్లు పొందినట్లు సమాచారం. ఈ అడ్డగోలు స్పౌజ్‌పై ఇటీవల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా... తొలగించకుండా అలాగే ఉంచారని సమాచారం. గతనెల 31న ఉద్యోగ విరమణ పొందిన వారి తరఫున స్పౌజ్ వాడుకోరాదని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. అయినా ఇలా కొందరు దొడ్డిదారిలో వెళ్తున్నారు. చర్యలు మాత్రం శూన్యం. మరికొందరు టీచర్లు, సంఘాల నేతలు సైతం రెండు, మూడేళ్ల కిందట స్పౌజ్ వాడుకుని, మరీ ఇప్పుడు యథేచ్ఛగా వాడుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ఎస్జీటీల్లో భారీగానే అక్రమాలు

కొందరు ఎస్జీటీలు భారీగా స్పౌజ్ వాడుకున్నట్లు తెలుస్తోంది. బోగస్ పీహెచ్ సర్టిఫికెట్లు కూడా పలువురు వినియోగించినట్లు తెలిసింది. వీటి ద్వారా అదనపు పాయింట్లు పొందారన్న విమర్శలున్నాయి. షెడ్యూల్ మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ల సీనియారిటీ జాబితాలు జూన్ 6న విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. ఆలస్యమయ్యే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తయిన తర్వాత ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇస్తారు. తర్వాత ఎస్జీటీల ఫైనల్ సీనియారిటీ ప్రకటిస్తారు. ఈ లోపు అడ్డగోలుగా స్పౌజ్ వాడుకున్న వారి చిట్టా తీస్తే.. అర్హులకు న్యాయం జరుగుతుంది. బోగస్ పీహెచ్ వాడుకున్న వారి బాగోతం బయట పెట్టి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయవర్గాలు కోరుతున్నాయి.

పండుగలా కూటమి పాలన: టీసీ వరుణ్



ముగ్గును తిలకిస్తున్న అహుడా చైర్మన్, ఎంపీ, నాయకులు

అనంతపురం సెంట్రల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలన పండుగలా సాగుతోందని జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ సంవత్సర పాలనను పురస్కరించుకుని జనసేన ఆధ్వర్యంలో ఏ నారాయణపురం పంచాయతీలో సంబరాలు నిర్వహించారు. టీసీ వరుణ్ మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఏడాదిలో తీసుకొచ్చిన పెట్టుబడులు, సంస్థల ఏర్పాటు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇందుకు నిదర్శమన్నారు. అనంతరం నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జనసేన నగరాధ్యక్షుడు బాబురావు, రాయలసీమ ప్రాంతీయ మహిళావిభాగ సమన్వయకర్త పెండ్యాల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర, సంజీవరాయుడు, ధనుంజయ్, కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.



పాతూరు మహిళకు పాజిటివ్

సుదీర్ఘ విరామం తర్వాత కొవిడ్ కేసు

(వివరాలు మెయిన్‌లో..)

రేపట్నుంచే డీఎస్సీ పరీక్షలు

● గంటన్నర ముందే కేంద్రాలకు.. ● జిల్లాలో 8, బెంగళూరులో 2 ఏర్పాటు ● హాజరుకానున్న 45,186 మంది (7లో...)

తమ్ముళ్ల సంబరం



టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

అనంతపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల నియంతృత్వ పాలనకు చరమగీతం పాడుతూ.. కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన రోజును పురస్కరించుకుని అనంతపురం జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలపై బుధవారానికి ఏడాది పూర్తి కావడంతో ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేసి, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. జగన్ ఐదేళ్ల అరాచక పాలన అంతమైన రోజేకాకుండా.. ఐదేళ్ల నిర్బంధానికి తెరపడిన రోజు ఇది అని ఆ పార్టీ నాయకులు అన్నారు. ప్రజల తీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా వైసీపీ నిర్వహించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అనంతపురం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. జై తెలుగుదేశం.. జై చంద్రబాబు అంటూ నినదించారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. యాడికి, విడపనకల్లు, అనంతపురం రూరల్, కనగానపల్లి, సీకే పల్లి, ఆత్మకూరు తదితర మండలాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలోసంబరాలు జరుపుకున్నారు.

ప్రజలను నట్టేట ముంచిన బాబు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

● అనంతలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

అనంతపురం క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు అలవికాని హామీలతో ప్రజలను నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వారిని నట్టేట ముంచారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలను ఎండగడుతూ వైసీపీ బుధవారం అనంతపురంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహించింది. ముందుగా తాడిపత్రి బస్టాండ్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి అనంతతో పాటు వైసీపీ అనంతపురం పార్లమెంటు పరిశీలకులు నరేష్ కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి పవర్‌ఆఫీస్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతవెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రైతులకు ఏటా రూ.20వేలు, తల్లికి వందనం పేరుతో రూ.15వేలు, మహిళలకు ప్రతి నెలా రూ.1500లు, నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3వేలు ఇస్తామని చెపిప మోసం చేశారన్నారు. నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది అవుతున్నా సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి విత్తన పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆత్మకూరు మండలం పంపనూరులో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కలెక్టర్ వినోద్ కుమార్ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో పరిధిల్లోని 232 రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి దాకా 21405 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేశారు.

హైస్కూల్ ప్లస్

పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులు కరువు

విద్యార్థులకు పుస్తకాలు కూడా లేని దుస్థితి

నేటికీ ప్రారంభంకాని 6 కళాశాలలు

ఫలితాల్లోనూ డీలా... మూత దిశగా పయనం

ఆర్భాటంగా ప్రారంభించి.. వదిలేసిన గత ప్రభుత్వం

అట్టర్ ఫ్లాప్..!



కొత్తచెరువు హైస్కూల్ ప్లస్

కొత్తచెరువు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్ కాలేజీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ప్రారంభించి గత ప్రభుత్వం వదిలేసింది. నిర్వహణ పట్టించుకోలేదు. కనీసం అధ్యాపకులను కూడా నియమించలేదు. పాఠ్య పుస్తకాలను కూడా అందజేయలేదు. పాఠం చెప్పేవారు లేరు, సొంతంగా చదువుకునేందుకు పుస్తకాలు కూడా లేవు. దీంతో హైస్కూల్ ప్లస్‌లో తమ పిల్లలను చేర్పించేందుకు విద్యార్థినులు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. జిల్లాలో పదింటిని ప్రారంభిస్తే.. ఆరింటిలో ఒక్కరంటే ఒక్కరు కూడా చేరలేదు. దీంతో నేటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. మిగతా వాటిలో కూడా తక్కువ మంది చేరారు. అధ్యాపకులు, పుస్తకాలు లేక ఈసారి ఫలితాల్లో ఆయా కాలేజీలు డీలాపడ్డాయి. చాలాచోట్ల జీరో ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాలతో ఫస్టియర్‌లో తమ పిల్లలను చేర్చిన తల్లిదండ్రులు సైతం సెకండియర్‌కు పంపేందుకు ఆసక్తి చూపట్లేదు. జూనియర్ కాలేజీలను పంపే యోచనలో ఉన్నారు. వెరసి.. ప్రారంభమైనా నాలుగు హైస్కూల్ ప్లస్ కాలేజీలు సైతం మూతపడే దుస్థితి దాపురించింది.

ఆర్భాటమే..

జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతో కూడిన హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలను గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పదో తరగతి పాసైన తరువాత ఇంటర్, పైచదువులకు వెళ్లకుండా ఎక్కువమంది మానేస్తున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీ (మిగతా 6వ పేజీలో..)

జిల్లాలో హైస్కూల్ ప్లస్ కాలేజీలు.. వాటిలో విద్యార్థినులు.. 2024-25 ఫలితాలు

హైస్కూల్ ప్లస్	ఫస్టియర్‌లో విద్యార్థినుల సంఖ్య	ఉత్తీర్ణత శాతం	సెకండియర్‌లో విద్యార్థినుల సంఖ్య	ఉత్తీర్ణత శాతం
కొత్తచెరువు	6	0	6	0
నంబులపూలకుంట	0	0	0	0
ఓబుళదేవరచెరువు	13	0	0	0
బత్తలపల్లి	0	0	0	0
గ్నాండ్లపెంట	0	0	0	0
గోరంట్ల	0	0	0	0
బుక్కపట్నం	0	0	0	0
పెనుకొండ	12	9	28	13
సోమందేపల్లి	0	0	0	0
రొళ్ల	21	3	0	0

కొత్త ఏడాదికి సర్వం సిద్ధం

విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం

పలు కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వ యత్నం

ధర్మవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను సకల సౌకర్యాలతో విద్యార్థులకు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వైసీపీ పాలనలో గాడి తప్పిన విద్యా వ్యవస్థను చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా కార్యక్రమాలు రూపొందిస్తోంది. ప్రతి తరగతికి ఒక ప్రత్యేక గది, ఒక ఉపాధ్యాయుడితో ఆదర్శపాఠశాలలు ఏర్పాటు చేస్తోంది. 6, 7, 8 తరగతులలో పిల్లల సంఖ్య 60 కంటే ఎక్కువ ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నతపాఠశాలగా మార్చింది. బాలికలు పదో తరగతి వరకు సొంతూరులోనే చదువుకునే వీలు కల్పించింది. పాఠశాలలు తెరిచిన మొదటి రోజే ప్రతి విద్యార్థికి యూనిఫామ్, రెండు జతల బూట్లు, బెల్టు, టైతో పాటు ఉచితంగా పుస్తకాలను అందజేయడానికి ఇప్పటికే విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా విద్యావ్యవస్థ మెరుగుదలకు ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలను రూపొందించింది.

వివరాలు ఇలా...

- జూన్ 6 నుంచి 19వరకు బడిబాట నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలన్ని బలోపేతం చేయడం, విద్యార్థులను చేర్చుకోవడం కోసం విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.


కొత్తచెరువు ప్రాథమిక పాఠశాల

- 6న గ్రామసభ నిర్వహించి బడిఈడు పిల్లల్ని బడిలో చేర్చడం, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై చర్చిస్తారు.
- 7న గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి బాలబాలికల్ని గుర్తించాలి.
- 8 నుంచి 10వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థికి సమకూరే సౌకర్యాలతో కరపత్రాలను ముద్రించి ఇంటింటా ప్రచారం చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలి. బడి మానేసిన పిల్లల్ని గుర్తించి తిరిగి చేర్పించేలా చేయాలి. ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి దగ్గరలోని భవిత కేంద్రానికి పంపాలి.
- 11న మొత్తం కార్యక్రమాలను సమీక్షించడం, లోటుపాట్లను సరిచేసుకోవాలి.
- 12న పునఃప్రారంభం రోజునే పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి.
- 13న సామూహిక అక్షరాభ్యాసాలు, బాలల సభ.
- 16న ఎల్‌ఐపీ కార్యక్రమం
- 17న విలీన విద్య, బాలికా విద్యా దినోత్సవం ఆచరించాలి.
- 18న డిజిటలీకరణ, మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన పెంచాలి.
- 19న ముగింపు కార్యక్రమంగా వివిధ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలి.

ఆర్థిసాయం కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు 2025 సంవత్సరానికి సంబంధించి సీసీఎస్ ద్వారా అందించే ఆర్థిక సాయం (వృద్ధాప్య సాయం) కోసం ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సీఈసీఎస్‌లో కనీసం ఐదేళ్ల సర్వీసు, 63 ఏళ్లు నిండినవారు అర్హులన్నారు. ఆర్టీసీ భద్రతా పథకంలో సభ్యులుగా ఉన్నవారు అనర్హులన్నారు. ఆసక్తి, అర్హత గలవారికోసం అనంతపురం డిపో వద్ద దరఖాస్తులను ఉచితంగా అందజేస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 30వతేదీలోపు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9985431084 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

పర్యావరణం

పర్యావరణ హితంతోనే జీవుల మనుగడ

పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల కృషి

బోడిగుట్టలను వనరులుగా మార్చిన తనకల్లు గిరిజనులు

ప్లాస్టిక్ అంతమే ఈ ఏడాది నినాదం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రకృతి ప్రశాంతంగా ఉంటే జీవుల మనుగడ సాఫీగా సాగుతుంది. అదే ప్రకోపిస్తే విలయమే. నానాటికి పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకృతిలో భాగమైన పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. జనాభా పెరుగుదలతో విచ్చలవిడిగా అడవులను నరికివేసి భూములను ఆక్రమిస్తున్నారు. ఈక్రమంలోనే మానవజాతితో పాటు పశుపక్ష్యాదులతోపాటు, వన్య మృగాలు సైతం విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం ప్రారంభించాయి. అందులో భాగంగానే అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఆ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పర్యావరణ పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


ముండ్లవారిపల్లి వద్ద పరుచుకున్న పచ్చదనం

తనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సహజవనరుల సంరక్షణ కోసం తనకల్లు మండలంలోని గిరిజనులు గత 30 ఏళ్లుగా శ్రమిస్తున్నారు. మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండా, ముండ్లవారిపల్లి, దండువారిపల్లి, పెద్దపల్లి, వడ్డుమరవపల్లి, మార్పురివాండ్లపల్లి, నాయనిచెరువుపల్లి, జామ్లానాయక్‌తండా తదితర గ్రామాల ప్రజలు తమ గ్రామాల చుట్టూ ఉన్న బోడి గుట్టలను మూడు దశాబ్దాలుగా అభివృద్ధి చేసి, ఉత్పాదకతనిచ్చే వనరులుగా మార్చుకున్నారు. ఒకప్పుడు ఎందుకు పనికిరాని బోడిగుట్టల్లో ట్రెంచ్‌లు కొట్టి, రాళ్లతో కట్టడాలు కట్టి, వాన నీటి వేగాన్ని నియంత్రించారు. తద్వారా మట్టి కొట్టుకుపోకుండా కాపాడుకున్నారు. మొక్కలు నాటి, సంరక్షించడంతో బోడిగుట్టల్లో పచ్చ దనం పరుచుకుంది. వేసవిలో తమ గుట్టలకు అగ్నికి ఆహుతవకుండా కార్యక్రమాలు చేపట్టారు. మేకలతో పచ్చదనానికి నష్టం వాటిల్లుతుందని భావించిన గ్రామాల గిరిజనులు సమష్టి నిర్ణయంతో వాటిని అమ్మేసి, గొర్రెలతో జీవనం సాగిస్తున్నారు. తాము కాపాడుకుంటున్న ఈ గుట్టలు, అడవిపై హక్కు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రెవెన్యూ అధికారులు మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండాల్లోని 90మంది మహిళలను ఒక సంఘంగా ఏర్పాటు చేసి, యూజ్‌ఆఫ్‌రైట్ హక్కును కల్పించారు. దీంతో మహిళలు ఈ అడవిని కాపాడుకోవడంలో మరింత శ్రద్ధ పెడుతున్నారు. ఆక్రమంలోనే అడవి రక్షణకు ఓ వాచర్‌ను కూడా నియమించుకున్నారు. దీంతో ఈప్రాంతంలో పచ్చదనం పరుచుకుంది. ఇలా ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం తమ ప్రాంతంలోని అడవుల ను స్వచ్ఛందంగా కాపాడుకునేలా మండలంలో పనిచేసే జనజాగృతి సంస్థ తమ సహాయ, సహకారం అందించింది. దీంతో మండలంలో వందలాది ఎకరాల్లో అడవుల్లో పచ్చదనం పెరిగింది. ప్రస్తుతం ఈ అడవుల నుంచి పశువుల మేత, ఎండు కట్టెలు, ఆకులు, వనమూలికలు, పండ్లు, కాయలు, తదితరవాటిని సేకరించుకుంటున్నారు. ఈఅడవుల్లో వందలాదిగా జింకలు, నేమళ్లు, వివిధ రకాల పక్షులు, అటవీ జంతువులున్నాయి.


పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు



30 ఏళ్ల కృషి



30 ఏళ్ల కిందట మా గ్రామం వద్ద ఉన్న బండారివానిగుట్ట, నారాయణప్ప సరవ, వేమన చేను, వడ్డేళ్ల చేను, ప్రాజెక్టు గుట్ట, ఈప్రాంతాల్లో ఎలాంటి చెట్లు లేకుండా బీడు గుట్టలు ఉండేవి. అలాంటి గుట్టలను జనజాగృతి సహకారంతో ప్రజలందరం ఏకమై రక్షించుకోవడంతో నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నేటికి కూడా గుట్టల్లో అగ్గి పడితే స్వచ్ఛందంగా ఆర్పుతున్నాం. ఇప్పటికే మేము చేపట్టిన అటవీ పెంపకాన్ని ఎంతో మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.

-పారేసునాయక్, రైతు, మొగిలిచెట్లతండా

జింకలు నాతో వచ్చేవి



30 ఏళ్ల కిందట ఒక మొక్కకూడా లేని ఈగుట్టల్లో జనజాగృతి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. గుట్టలు బాగా అభివృద్ధి చెందాక జింకలు, నెమళ్లు వచ్చాయి. నేను కట్టె చేతపట్టుకుని అడవిలో నడుస్తుంటే జింకలు నాతో పాటు నడిచేవి. మా గ్రామంవద్ద ఉన్న అడవిలో అన్నిరకాల చెట్లు ఉన్నాయి. అటవీ సంరక్షణ చేపట్టినప్పుడే ఆప్రాంతంలో వ్యవసాయంకూడా బాగుటుంది. అడవులు బాగుంటే కరువు కూడా వచ్చే అవకాశం ఉండదు.

-గంగులప్ప, అడవి కాపలాదారుడు, మొగిలిచెట్లతండా

పచ్చదనం కోసం కృషి



జిల్లాలో 33శాతం భూభాగాన్ని పచ్చదనంతో నింపడానికి కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 14శాతం రిజర్వు ఫారెస్టు, 6శాతం పండ్లతోటలు, ఆగ్రో ఫారెస్టు, ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనంతో నిండి ఉంది. ప్రస్తుతం జిల్లాలో 1,25,500 హెక్టార్లో పచ్చదనముంది. ఇంకా 1.20లక్షల హెక్టార్లలో పచ్చదనం తీసుకురావాల్సి ఉంది. ఇందుకోసం ఉద్యాన తోటలు, ఆగ్రో ఫారెస్టు, ఉమ్మడి భూముల సంరక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. 2030-35నాటికి భూభాగంలో 33శాతం పచ్చదనం కోసం కృషి చేస్తున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా మొక్కలను నాటుతున్నాం.

-చక్రపాణి, డీఎఫ్‌ఓ, శ్రీసత్యసాయి జిల్లా

ప్లాస్టిక్ అంతమే లక్ష్యం

అనంతపురం క్లాక్‌టవర్/బుక్కపట్నం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జీవుల మనుగడకు పెను సవాల్‌గా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించడమే ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ నినాదంగా తీసుకువచ్చారు. ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ప్రతి ఏటా ఏదో ఒక అంశంతో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఏడాది ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించాలనే అంశాన్ని నినాదంగా తీసుకువచ్చింది.

1.5లక్షల మొక్కలు నాటుతాం



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధి హామీ పథకం కింద వనమహోత్సవంలో 1.5లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. 2353 ఫారంపాండ్ గట్ల మీద కొబ్బరి, మామిడి, నిమ్మ, మునగ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలు నాటాలి. బౌండ్రీ ప్లాంటేషన్ కింద హార్టికల్చర్, ఇతర రైతుల పొలం గట్లపై టేకు, శ్రీగంధం, మహాగని మొక్కలు నాటుతాం. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, దేవదాయ భూములలో రావి, వేప, మర్రి, జువ్వి, కానుగ, చింత, ఉసిరి, నేరుడు వంటి మొక్కలు నాటుతాం.

- సలీంబాషా, డ్వామా పీడీ

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను

పుట్టపర్తికి పొడిగించాలి

శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగుల డిమాండ్

అనంతపురం న్యూటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం-మచిలీపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును పుట్టపర్తి వరకు పొడిగించాలని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగులు.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. బుధవారం అనంతపురంలో బెంగళూరుకు మెము రైలు ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీని ఉద్యోగులు కలిశారు. వారు మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు తర్వాత అనంత నుంచి తమను పుట్టపర్తికి బదిలీ చేశారన్నారు. పుట్టపర్తిలో నివాసం ఉండాలంటే పిల్లలకు విద్యాసదుపాయాలు కూడా లేవన్నారు. దీంతో అనంతపురం నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. 600మంది వరకు ఉద్యోగులు రోజూ రాకపోకలు సాగిస్తున్నారన్నారు. బస్సు, రైలు సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో ధర్మవరం, మచిలీపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును పుట్టపర్తి వరకు పొడిగిస్తే కొంతవరకు సమస్య తీరుతుందన్నారు. అనంతపురం, బెంగళూరు మధ్య కొత్తగా వేసిన మెము రైలు ఉదయం ఉదయం 8 గంటలకు బయల్దేరేలా చూడాలన్నారు. ఇది ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

హైస్కూల్ ప్లస్ అట్టర్ ఫ్లాప్..!

(5వ పేజీ తరువాయి)

హైస్కూళ్లలో హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి, అప్పట్లో ఆర్భాటంగా ప్రారంభించారు. తరగతి గదులు, ల్యాబ్‌లు తదితర మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. అధ్యాపకులను కూడా నియమించలేదు. పాఠ్యపుస్తకాలు కూడా సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో అవి ఆరంభంలోనే తుస్సుమన్నాయి. ఈ కళాశాలల్లో విద్యార్థినులు చేరేందుకు ససేమిరా అంటున్నారు. గత రెండేళ్లలో హైస్కూల్ ప్లస్ చదివిన విద్యార్థినుల ఉత్తీర్ణత శాతం కూడా 10 నుంచి 15 శాతంలోపే ఉంది. మొదటి సంవత్సర ఫలితాల్లో మూడు, సెకండియర్‌లో రెండు కళాశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది. కొత్తచెరువు కాలేజీలో ఫస్టియర్, సెకండియర్‌లో ఆరుగురు చొప్పున విద్యార్థినులు ఉండగా.. అందరూ ఫెయిలయ్యారు. ఓబుళదేవరచెరువులో ఫస్టియర్ పరీక్షలు 13 మంది రాయగా.. అందరూ ఫెయిలయ్యారు.

ఫలితాల్లో డీలా

జిల్లాలో ఏర్పాటుచేసిన పది హైస్కూల్ ప్లస్ కాలేజీల్లో నాలుగింటిలో మాత్రమే విద్యార్థినులు చేరారు. వారు 2024-25 వార్షిక పరీక్షలు రాశారు. దారుణమైన ఫలితాలు వచ్చాయి. 104 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా.. 15 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ ఆయా కాలేజీల్లో కొనసాగకుండా 36 మంది ప్రైవేటులో చేరిపోయారు. సెకండ్ పరీక్షలు 68 మంది రాయగా.. 38 మంది పాసయ్యారు. ఇలా హైస్కూల్ ప్లస్ కాలేజీలు ఫలితాల్లోనూ డీలా పడ్డాయి. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్షం.. ఈ కళాశాలలకు శాపంగా మారిందని చెప్పవచ్చు.

చేరేందుకు ససేమిరా

హైస్కూల్ ప్లస్ జూనియర్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థినులు ససేమిరా అంటున్నారు. అధ్యాపకులను నియమించకపోవడంతో బోధన కరువైంది. దీంతో విద్యార్థినులు ఆసక్తి చూపట్లేదు. ఈ కాలేజీల్లో ప్రవేశాల కోసం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. హైస్కూల్ టీచర్లతోనే పాఠాలు చెప్పించాలా వారిపై ఒత్తిడి తెచ్చింది. ఆ టీచర్లు ఒప్పుకోలేదు. వెరసి.. హైస్కూల్ ప్లస్ కాలేజీలు మూత దిశగా నడుస్తున్నాయి.



అధ్యాపకుడు లేక తరగతి గదిలో ఖాళీగా కూర్చున్న విద్యార్థినులు (ఫైల్)

చెరువులకు మహర్దశ

తీరనున్న తాగు, సాగునీటి అవసరాలు

ఇంజనీర్ల కొరతతో ప్రతిపాదన తయారీలో జాప్యం

● అభివృద్ధికి ప్రభుత్వాల నిర్ణయం ● మొదటి దశలో 500కిపైగా చెరువులకు మోక్షం


గుత్తి చెరువు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత వనరులైన చెరువులకు మహర్దశ పట్టనుంది. చెరువుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. కేంద్ర జలశక్తి అభియాన్ ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధానమంత్రి కృషి సంచార్ యోజన (పీఎంకేఎస్‌వై)-హర్ ఖేత్‌కో పానీ (హెచ్‌కేకేపీ) పేరుతో చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు ఇవ్వనున్నాయి. చెరువులను పటిష్టంగా మార్చి, సామర్థ్యం పెంచి, మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఉమ్మడి జిల్లాలో 1,487 చెరువులు ఉండగా.. మొదటి దశలో 500కిపైగా అభివృద్ధి చేయనున్నారు. గత వైసీపీ హయాంలో కేంద్రం రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా.. రాష్ట్ర ప్రభుత్వం నిధుల్లేవని తిరస్కరించింది. కొత్త ప్రభుత్వం.. కేంద్రం ప్రతిపాదనకు అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించేందుకు సరే అంది. దీంతో చెరువుల అభివృద్ధికి చర్యలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇరిగేషన్‌లో ఇంజనీర్ల కొరతతో ప్రతిపాదనల తయారీలో ఆలస్యమవుతోంది.

నాలుగంచెల పద్ధతిలో ఎంపిక

నాలుగంచెల పద్ధతిలో చెరువులను ఎంపిక చేయనున్నారు. 2 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉండే చెరువును ఎంపిక చేస్తారు. వ్యయం కంటే రాబడి ఎక్కువగా ఉండేవాటికి ప్రాధాన్యమిస్తారు. జిల్లాస్థాయిలో మైనర్ ఇరిగేషన్ డివిజన్ ఇంజనీర్ కన్వీనర్‌గా ఉండే కమిటీలో మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ, గ్రౌండ్‌వాటర్ డీడీ, డ్వామా పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, సెంట్రల్ వాటర్ కమిషన్ మెంబర్, సెంట్రల్ వాటర్ బోర్డు మెంబర్ సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ, అక్కడి నుంచి రాష్ట్రస్థాయి నిధుల మంజూరు కమిటీ, అక్కడి నుంచి కేంద్రప్రభుత్వ చెరువుల అభివృద్ధి కమిటీకి ప్రతిపాదనలు పంపుతారు. కమిటీ ఎంపిక చేసిన చెరువులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులిచ్చి, అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు.

గత వైసీపీ ప్రభుత్వం నిరాకరణ

వైసీపీ హయాంలో చెరువుల అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. తన వాటా 40శాతం నిధులు చెరువుల అభివృద్ధికి ఇవ్వలేమంటూ వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో చెరువుల అభివృద్ధి పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయలేకపోయారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండు దఫాలు కేంద్రం నుంచి వచ్చిన ప్రతిపాదనలను తిరస్కరించారు. కేంద్రం నుంచి ఈ దఫా వచ్చిన ప్రతిపాదనను కొత్త ప్రభుత్వం స్వాగతించింది.

తొలి దశలో 500..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500 చెరువుల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 1,487 చెరువులున్నాయి. అనంతపురం జిల్లాలో 301, శ్రీసత్యసాయిలో 1,186 ఉన్నాయి. ఇప్పటి వరకు 90 చెరువుల ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా చెరువుల ప్రతిపాదనలు పంపిస్తే 500కిపైగా ఎంపికవవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బహుళ ప్రయోజనాలు

చెరువుల అభివృద్ధితో బహుళ ప్రయోజనాలున్నాయి. చెరువుల్లో ముళ్లకంపల తొలగింపు, పూడికతీత పనులు చేపట్టనున్నారు. దీంతో భూగర్భజలాల పెంపుతోపాటు వ్యవసాయం, చెరువు పరివాహక ప్రాంతాల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు చేపడతారు. చెరువు ఆయకట్టు మొత్తం సాగులోకి వచ్చే అవకాశం ఉంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. సాగు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. చెరువులను ఆహ్లాదకరంగా తయారు చేసి, గ్రీనరీని పెంచడం, పర్యాటకంగా అభివృద్ధి చేయడం ఇందులో భాగం.

వేధిస్తున్న ఇంజనీర్లు, సిబ్బంది కొరత

గత ఐదేళ్లుగా మైనర్ ఇరిగేషన్‌లో ఇంజనీర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. మైనర్ ఇరిగేషన్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఎస్‌ఈ, డిప్యూటీ ఎస్‌ఈ, ముగ్గురు ఈఈలు, 15 మంది డీఈలు ఉన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేయించాల్సిన ఏఈలు 63 మందికిగాను 30మంది మాత్రమే ఉన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లష్కర్లు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. ఇంజనీర్లు, సిబ్బంది కలిపి 600 మందికిపైగా ఉండాలి. 207మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఆదేశించిన చెరువుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయడంలో ఆలస్యమవుతోందని ఆ శాఖ ఇంజనీర్లు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.


మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ కార్యాలయం

చెరువులను పటిష్టపరుస్తాం



చెరువుల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. మూడు నెలల్లో ప్రభుత్వాల అనుమతితో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. ఇంజనీర్లు, ఉద్యోగుల కొరతతో ప్రతిపాదనల తయారీలో ఆలస్యమవుతోంది. రెండేళ్లలో చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. ఆ మేరకు పనులు పూర్తి చేస్తాం.

-విశ్వనాథ్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ

నాపై ఆరోపణలు నిరూపిస్తే

రాజకీయాలు వదులుకుంటా

నాస్థాయి వ్యక్తికాదనే ఇంతదాకా ఓపిక పట్టా..

వాస్తవాలు ప్రజలకు చెప్పాలనే నోరువిప్పా

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి


మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

అనంతపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ తనపై చేస్తున్న ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటానని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. భూఅక్రమార్కుడు.. ఆదినారాయణేనని ఆరోపించారు. ఆ వ్యక్తిది తన స్థాయి కాదనే.. ఇంతదాకా ఓపిక పట్టానన్నారు. వాస్తవాలు ప్రజలకు చెప్పాలనే మాట్లాడాల్సి వస్తోందని పల్లె స్పష్టం చేశారు. స్థానిక పీవీకేకే కళాశాలలో మాజీ మంత్రి పల్లె బుధవారం మీడియాతో మాట్లాడారు. ఒకరి భూముల జోలికెళ్లాల్సిన అవసరం తనకు లేదన్నారు. మూడు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నానన్నారు. ఎలాంటి మచ్చలేకుండా ప్రజలు, కార్యకర్తలకు సేవ చేస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ఎవరు కష్టాలు, బాధల్లో ఉన్నా.. ఆర్థికంగా సాయం చేస్తూ కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటున్నానన్నారు. విద్యాసంస్థల ద్వారా ఎంతోమందికి ఉచితంగా విద్య అందించడమే కాకుండా ఉద్యోగావకాశాలు కల్పించానన్నారు. ఇటీవల గొడ్డుమర్రి ఆదినారాయణ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా, కొంతమంది నాయకులకు వాస్తవాలు చెప్పకుండా తనపై అబాండాలు వేస్తూ తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నాడన్నారు. తాను భూకబ్జాదారుడని అసత్యప్రచారాలు చేస్తున్నారనీ, ఎక్కడైనా సెంటు భూమి కాజేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. నడిరోడ్డుమీదకు వచ్చి ప్రజలకు క్షమాపణలు చెబుతానన్నారు. దొంగే.. దొంగ అన్నట్లుగా ఆదినారాయణ తమ కంపెనీ భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకుని, తనపైనే ఆరోపణలు చేస్తున్నాడన్నారు. తాను భూములు ఆక్రమించి ఉండుంటే ప్రభుత్వమే సిట్ ఏర్పాటు చేసి, విచారణ చేసి, నిజానిజాలు నిగ్గుతేల్చి న్యాయం చేయాలని కోరుతున్నట్లు పల్లె వివరించారు.

పేరూరు డ్యాంకి నీరిచ్చే పనులు చేపట్టండి

నివేదికలు ఇవ్వండి.. హంద్రీనీవా అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురంరూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి జలాశయం నుంచి పేరూరు అప్పర్ పెన్నార్ (పరిటాల రవీంద్ర సాగునీటి పథకం) జలాశయానికి నీరందించే పనులు పునఃప్రారంభించాలని హంద్రీనీవా అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి హంద్రీనీవా అధికారులతో పరిటాల సునీత బుధవారం సమావేశమయ్యారు. గతంలో పేరూరు జలాశయానికి నీరందించే పనులు కొంతవరకు చేశామన్నారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుత పరిస్థితి గురించి నివేదికలు పంపాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, పరిహారం పంపిణీపై వివరాలివ్వాలన్నారు. త్వరలోనే ఆర్థిక శాఖ మంత్రిని కలిసి పరిహారం వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఎస్‌ఈ రాజాస్వరూప్‌కుమార్, ఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తగ్గిన వరద

బొమ్మనహాళ్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందించే జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం జలాశయానికి ఇన్‌ఫ్లో 8,222 క్యూసెక్కులకు తగ్గిందని టీబీ బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1599.15 అడుగుల నీటి మట్టం, నిల్వ 20.45 టీఎంసీలు ఉందని పేర్కొన్నారు. శివమొగ్గ, అగుంబె, హరిహర ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతోనే జలశయానికి వరద తగ్గింది.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి



ప్రిన్సిపాల్ రామమూర్తి మృతదేహం

అనంతపురం సెంట్రల్/విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటక సరిహద్దు వద్ద భారత్ పెట్రోలు బంక్ సమీపాన బుధవారం మధ్యాహ్నం కారును గ్యాస్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి (50) మరణించారు. స్థానికులు, విడపనకల్లు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామమూర్తి అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండేవారు. వ్యక్తిగత పని మీద అనంతపురం నుంచి బళ్లారికి కారులో బయల్దేరారు. ఉరవకొండ-అనంతపురం 42వ జాతీయ రహదారిపై బళ్లారి నుంచి అనంతపురం వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. ఆయనను బయటకు తీసి విడపనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మరణించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలోని సొంతూరికి మృతదేహాన్ని తరలించనున్నారు. రామమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బీటెక్ పూర్తిచేయగా, కుమార్తె అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలోనే బీటెక్ చదువుతోంది. రామమూర్తి మృతికి కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.

బడికి వెళ్లాలా... వద్దా..?

నేడు పాఠశాలలో ఉండాలని కమిషనర్ ఉత్తర్వులు
గందరగోళంలో ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లాలా...వద్దా...?!, పాయింట్లు ఉంటాయో ఉండవో..? ఇచ్చిన ఆప్షన్ ఉంటుందో...ఊడిపోతుందో..! ఏ స్కూల్‌కు ఆర్డర్ వస్తుందో...? ఇదీ ఉపాధ్యాయుల్లో ఉన్న టెన్షన్. అటు స్కూల్‌కు వెళ్లాలా...లేక ఇటు బదిలీలు చూసుకోవాలా..? లేక ప్రమోషన్‌కు అప్లై చేయాలా అంటూ గురువులు హైరానా పడుతున్నారు. జూన్ 12వ తేదీ స్కూళ్ల పునఃప్రారంభం కానుండగా 5నే పాఠశాల సంసిద్ధత(స్కూల్ రెడీనెస్) కోసం ప్రధానోపాధ్యాయులు, టీచర్లు స్కూళ్లకు వెళ్లాలంటూ అధికారులు హడావుడి చేస్తూ హెచ్చరిస్తున్నారు. దీంతో అటు టీచర్లు, ఇటు అధికారులు, విద్యాశాఖలో గందరగోళం నెలకొంది.

వెళ్లి ఏం చేయాలబ్బా?

పాఠశాల సంసిద్ధత కోసం స్కూళ్లకు గురువారం వెళ్లాంటూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. అయితే స్కూళ్లకు వెళ్లిన టీచర్లకు పాఠశాల సంసిద్ధత కోసం ఏం చేయాలో స్పష్టమైన ఆదేశాలు లేవు. అయితే కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని డీఈఓ ప్రసాద్‌బాబు సైతం జిల్లాలో ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు, సంఘాల నేతలు ఈ ఉత్తర్వులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బదిలీలు, ప్రమోషన్ల హడావుడి పూర్తి కాకుండానే స్కూళ్లకు పరుగులు తీసేలా ఉత్తర్వులు ఇవ్వడంపై టీచర్లు భగ్గుమంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15 వేల మంది టీచర్లు ఉంటే వాళ్లలో మెజార్టీ స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలకు ఇంకా బదిలీలు, ప్రమోషన్లు పూర్తికాలేదు. ఆయావర్గం టీచర్లు అంతా పాయింట్లు, ఆప్షన్లు, ఆర్డర్లు అంటూ తెగ హైరానా పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇవేం ఉత్తర్వులంటూ నాయకులు పెదవి విరుస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయ్యే వరకూ ఈ కార్యక్రమం వాయిదా వేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..

అనంతపురం నుంచి తొలి రైలు ప్రారంభం
అట్టహాసంగా మెముకు శ్రీకారం
ఇక్కడి నుంచి మరిన్ని రైళ్లు: ఎంపీ అంబికా



రైలును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం న్యూటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అనంత వాసుల దశాబ్దాల కల నెరవేరింది. అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి తొలి రైలు బయల్దేరింది. అనంతపురం-బెంగళూరు మెము రైలుకు శ్రీకారం చుట్టారు. అనంతపురం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైలు ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కలెక్టర్ వినోద్‌కుమార్, డీజీఎం ఉదయ్‌కుమార్, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా హాజరయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యే జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అనంతపురం రైల్వే స్టేషన్ నుంచి బెంగళూరు వెళ్లే (66560) మెము రైలును ప్రారంభించారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అనంతపురం వాసుల దశాబ్దాల కల తాను ఎంపీగా ఉన్న సమయంలో నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా ఎంపీగా డిక్లరేషన్ తీసుకున్న కచ్చితంగా ఏడాదికి రైలును ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇది కూటమి ప్రభుత్వ విజయమన్నారు. మెము రైలులో ప్రయాణికులు కూర్చుని ఉండడం సంతోషాన్నిస్తోందన్నారు. ప్రస్తుతం అనంతపురంలో మధ్యాహ్నం 2.10 గంటలకు రైలు బయల్దేరుతుందన్నారు. అన్నివర్గాల వారికి అనుకూలంగా ఉదయం అనంతపురం నుంచి ప్రారంభించాలని వినతులు వస్తున్నాయన్నారు. వాటిపై ఆలోచిస్తామన్నారు. అనంతపురం నుంచి రైలు బయల్దేరాలంటే రైలుకు నీటిని నింపే సౌకర్యాం లేదన్నారు. త్వరలో ఆ సౌకర్యం కూడా కల్పించి, ఉదయమే రైలు బయల్దేరేలా కృషి చేస్తామన్నారు. పుట్టపర్తి వరకు 8 బోగీలతోనే నడిచే రైలును అనంతపురం వరకు పొడిగించడంతో మరో 4 అదనంగా చేర్చారన్నారు. ఈ మెముతో పాటు గుంతకల్లు నుంచి మరో రైలు ప్రారంభించాలని రైల్వే డీజీఎం ఉదయ్ కుమార్, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకి ఎంపీ విన్నవించారు. రాజధాని అమరావతికి రద్దీకి అనుగుణంగా రైళ్లు నడపడానికి సహకారం అందించాలన్నారు. ప్రస్తుతం ఉన్న రైళ్లలోనైనా కోచ్‌లు పెంచేలా చూడాలన్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను రోజూ నడపాలన్నారు. విజయవాడ నుంచి అనంతపురం మీదుగా బెంగళూరుకు వందేభారత్ రైలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉదయమే ప్రారంభించాలి

అనంతపురం నుంచి బెంగళూరుకు మెము రైలు నడపడం ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజకరమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఈ రైలు ఉదయమే అనంతపురం నుంచి బయల్దేరేలా చర్యలు తీసుకుంటే అన్నివర్గాల వారికి ప్రయోజకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పరిటాల సునీత, డీజీఎం ఉదయ్‌కుమార్ జెండా ఊపి, రైలును ప్రారంభించారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ వరుణ్, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, సీనియర్ నాయకులు బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, దేవళ్ల మురళి, ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, సింగవరం రవి, క్రిస్టియన్ సెల్ నేత స్వామిదాస్, స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

యాడికిలో ఉద్రిక్తత

విజయోత్సవ ర్యాలీ.. వెన్నుపోటు దినంతో ఉత్కంఠ
పెద్దఎత్తున మోహరించిన పోలీసు బలగాలు



టీడీపీ నాయకులకు సర్దిచెబుతున్న ఏఎస్పీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

యాడికి, జూన్4(ఆంధ్రజ్యోతి): ఒకవైపు విజయోత్సవ ర్యాలీ, మరోవైపు వెన్నుపోటు దినం చేపట్టడంతో బుధవారం యాడికిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో యాడికిలో టీడీపీ నాయకులు విజయోత్సవ, వైసీపీ నాయకులు వెన్నుపోటుదినం ర్యాలీలు చేపట్టారు. వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వస్తున్నారని సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని యాడికికి రాకుండా అడ్డుకుంటామని టీడీపీ నాయకులు ప్రకటనలు చేశారు. యాడికిలోని వైసీపీ కార్యాలయం వద్దకు తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు, కోడుమూరు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి యాడికికి రావాలని ప్రయత్నించారు. పెద్దఎత్తున కాన్వాయ్‌తో యాడికికి వచ్చిన హర్షవర్ధన్‌రెడ్డిని కోనరోడ్డులో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు.. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంలో టీడీపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించాలని తలపెట్టారు. నాయకులంతా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు బయలుదేరారు. సమాచారం అందుకున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి టీడీపీ నాయకులను స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద అడ్డుకున్నారు. వైసీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్నారనీ, ఇపుడు ర్యాలీగా వెళ్లడానికి వీలులేదని టీడీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల వైఖరిపట్ల టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శాంతియుతంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకుంటున్నామనీ, తమను ఎలా అడ్డుకుంటారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గొడవలు జరగకుండా సహకరించాలని పోలీసులు కోరడంతో ర్యాలీగా వచ్చిన టీడీపీ నాయకులు వెనుదిరిగారు. పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో తమపై లెక్కలేనన్ని అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పాలనలోనూ టీడీపీ నాయకులకు సర్దిచెప్పడం సరి కాదన్నారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకుంటున్న తమను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ఏఎస్పీని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. విజయోత్సవ ర్యాలీ, వెన్నుపోటుదినం కార్యక్రమాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని యాడికి ప్రజల్లో ఆందోళన నెలకొని ఉంది. అవాంఛనీయ ఘటనలు తలెత్తకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో సుమారు 200మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. యాడికి అప్‌గ్రేడ్ సీఐ ఈరన్న, సర్కిల్ సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ వెంకటరమణయ్య, పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు ప్రత్యేకంగా రప్పించిన రోప్‌వే, స్పెషల్‌పార్టీ పోలీసులతో బందోబస్తును పర్యవేక్షించారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ వైసీపీ నాయకులు.. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రెవెన్యూ బదిలీలు ప్రారంభం

ఎనిమిది మంది తహసీల్దార్లకు స్థానచలనం
ఉత్తర్వులు విడుదల చేసిన కలెక్టర్
రెండో జాబితా ఉందంటూ ప్రచారం

అనంతపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో బదిలీలు మొదలయ్యాయి. తొలుత ఈనెల 2వ తేదీలోగా బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో అత్యంత కీలకమైన రెవెన్యూలో బదిలీలపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఈ బదిలీలకు ఈనెల 9వ తేదీ వరకు గడువు పొడిగించింది. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్, జేసీ, డీఆర్వోలు.. రెవెన్యూశాఖలో బదిలీలపై దృష్టిపెట్టారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పడినపుడు బదిలీలు చేసినా నిబంధనలను సాకుగా చూపి, ప్రజాప్రతినిధులు సూచించిన వారిని జిల్లా ఉన్నతాధికారులు నియమించలేకపోయారు. దీనిపై అప్పట్లో కొంతమేర వివాదం తలెత్తడంతో ఆ తర్వాత కొంతమందిని మార్పులు చేస్తూ వచ్చారు. ఈసారి బదిలీల్లో జిల్లాయంత్రాంగం ఆచితూచి అడుగులు వేసినట్లు ప్రస్తుతం తహసీల్దార్ల బదిలీలను బట్టి తెలుస్తోంది.

బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలిలా...

తహసీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
అనిల్‌కుమార్	డీ హిరేహాళ్	బెలుగుప్ప
షర్మిల	బెలుగుప్ప	కళ్యాణదుర్గం ఆర్డీఓ ఆఫీస్
ఈశ్వరమ్మ	కల్యాణదుర్గం ఆర్డీఓ ఆఫీస్	శెట్టూరు
ఉషారాణి	పెద్దవడుగూరు	తాడిపత్రి
రజాక్‌వలి	తాడిపత్రి	గుమ్మఘట్ట
శ్రీనివాసులు	గుమ్మఘట్ట	పెద్దవడుగూరు
యుగేశ్వరీదేవి	కలెక్టరేట్	డి హిరేహాళ్
శేషారెడ్డి	పుట్లూరు	కలెక్టరేట్

తహసీల్దార్లతో ప్రారంభం

రెవెన్యూశాఖలో తొలుత తహసీల్దార్ల బదిలీలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఎనిమిదిమంది తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ బుధవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల వ్యవహారాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. తెల్లవారుజామున జాబితాను విడుదల చేశారు. వీరందరూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీ అయ్యారు. వారికి మళ్లీ స్థానచలనం కల్పించారు.

మరో జాబితాపై ఉత్కంఠ

తహసీల్దార్ల బదిలీలు ఇంకా ఉన్నాయనే చర్చ రెవెన్యూ వర్గాల్లో సాగుతోంది. ప్రస్తుతం ఎనిమది మందికి మాత్రమే స్థానచలనం కల్పించారు. ఇంకా చాలామంది పట్ల ఆయానియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అసంతృప్తిగా ఉండడంతో బదిలీ చేయాలని సూచించినట్లు రెవెన్యూవర్గాలు చెప్పుకుంటున్నాయి. దీంతో తహసీల్దార్ల బదిలీల రండోజాబితాకూడా తప్పకుండా ఉంటుందని పెద్దఎత్తున చర్చ సాగుతోంది. దీనిపై ఉన్నతాధికారులు మౌనంగా ఉంటున్నారు. రెండోవిడతలో ఎవరెవరెవరికి స్థానచలనం ఉంటుందోనని రెవెన్యూ ఉద్యోగులు ఉత్కంఠగా చూస్తున్నారు.

ఆట.. అప్పు.. ఆత్మహత్య!

(5వ పేజీ తరువాయి)

చైతన్యం రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఈ ఐపీఎల్ సీజన్‌లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బయటకు రాని బలవన్మరణాలు మరికొన్ని ఉన్నాయి. అప్పులు, అవమానాలు, ఆస్తుల అమ్మకాలు.. ఇలా చాలా దారుణాలే జరిగాయి.

అప్పుల ఊబి

- ఉమ్మడి జిల్లాలో మారుమూల గ్రామాలకూ క్రికెట్ బెట్టింగ్ పాకింది. రూ.50వేల నుంచి రూ.25 లక్షల వరకు వివిధ వర్గాల వ్యక్తులు బెట్టింగ్‌లో మునిగిపోయినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.15 లక్షలు నష్టపోయాడు. డబ్బు టర్నోవర్ చేయలేక తంటాలు పడుతున్నాడు. అనంతలోనే మరో యువకుడు రూ.7లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులవారి ఒత్తిడితో విషయం తల్లిదండ్రులకు తెలిసింది. వారు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధం కావడంతో 70 శాతం డబ్బు కట్టేలా ఒప్పందం కుదిరింది.
- అనంతపురానికి 20 కి.మీ. దూరంలోని ఓ ప్రాంతానికి చెందిన యువకుడు కొన్నేళ్లుగా ఐపీఎల్ మ్యాచ్‌లో భారీగానే బెట్టింగ్ పెట్టాడు. దీనికి తోడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. అప్పులు తడిసి మోపడయ్యాయి. వాటిని తీర్చేమార్గం కనిపించక తన భూమిని రూ.అర కోటికి అమ్మి అప్పులు తీర్చే పనిలో పడ్డాడట.

రూ.కోట్లలో బెట్టింగ్.

- అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో భారీగా బెట్టింగ్ ఆడుతుంటారు. ఐపీఎల్ మ్యాచ్‌లకు రోజుకు రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఆడి ఉంటారని అంచనా. ఆన్‌లైన్ యాప్‌లోకి ఫోన్ పే ద్వారా డబ్బు వేసుకుని బెట్టింగ్ ఆడుతుంటారు. ప్రతి మ్యాచ్‌కు రూ.1000 నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టే క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లున్నారు. ఇక చివరి ప్లే ఆఫ్, క్వాలిఫయిర్, ఫైనల్ మ్యాచ్‌లకు బెట్టింగ్ రూ.2కోట్ల నుంచి రూ.2.50కోట్ల వరకు జరిగి ఉంటుందని సమాచారం.
- బెట్టింగ్‌ను అరికట్టాల్సిన పోలీసులు కూడా ఈ ఊబిలోకి దిగారు. ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారులు సైతం బెట్టింగ్‌కు పాల్పడుతుండటం విస్మయం కలిగిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా ఈ వ్యవహారాలు కుటుంబ సభ్యులకు తెలియడం లేదు. విషయం తెలిసేలోగా పుట్టి మునుగుతోంది.
- హిందూపురంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగ్‌కు దిగి మొదట రూ.2 లక్షలు గెలిచాడు. ఆ తరువాత రూ.8 లక్షలు నష్టపోయాడు. అప్పులోళ్లు చుట్టుముట్టడంతో పట్టణం వదిలి పారిపోయాడు.
- హిందూపురంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఈ ఐపీఎల్ మ్యాచ్‌లలో రూ.లక్ష పోగొట్టుకున్నాడు. ఆ తరువాత తన భార్య బంగారం, తన బైక్‌ను కుదువపెట్టాడు. ఎందుకని భార్య ప్రశ్నించడంతో గొడవ జరిగింది. అత్త, మామలు ప్రశ్నిస్తే తాను క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయానని చెప్పాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది.
- హిందూపురం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ చీరల వ్యాపారి కుమారుడు ఈ ఐపీఎల్ సీజన్‌లో అరకోటివరకు పోగొట్టుకున్నాడు. తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు వెతికి.. కర్ణాటకలో ఉండగా పిలుచుకుని వచ్చారు.

రూ.30 కోట్లపైనే..

ఈ ఐపీఎల్ సీజన్‌లో హిందూపురంలో రూ.30 కోట్లకుపైగా బెట్టింగ్ జరిగినట్లు అంచనా. కానీ రూ.50 కోట్లు దాటిందని కొందరు అంటున్నారు. చిన్నమార్కెట్ పరిసర ప్రాంతంలో రోజూ రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలదాకా బెట్టింగ్ జరిగింది. ముద్దిరెడ్డిపల్లిలో రోజూ రూ.కోటి దాకా ఆట సాగింది. పట్టణంలోని మరో రెండు ప్రధాన ప్రాంతాల్లో రోజూ రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల దాకా బెట్టింగ్ జరిగింది. ఇవి బయటకు వచ్చిన గణాంకాలు మాత్రమే. రానివి ఎన్నున్నాయో బెట్టింగ్ నిర్వాహకులకే ఎరుక.

మంత్రి కేశవ్‌కు యువగళం పుస్తకం



అనంతపురం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రిమండలి సమావేశం సందర్భంగా లోకేశ్‌ను కేశవ్ కలిశారు.

రేపట్నుంచే డీఎస్సీ పరీక్షలు

- గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలి..
- జిల్లాలో 8, బెంగళూరులో 2 ఏర్పాటు

అనంతపురం విద్య, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025(ఏపీ టీచర్స్ రిక్రూట్‌మెంట్) పరీక్షలు రాసే అభ్యర్థులు గంటన్నర ముందే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. పరీక్షలు ఈనెల 6న ప్రారంభం అవుతాయని బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 30వతేదీ వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ నిత్యం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షాకేంద్రాలు అనంతపురంలో 5, తాడిపత్రి, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున, బెంగళూరులో రెండు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 8 కేంద్రాలు, బెంగళూరులోని 2 కేంద్రాల్లో కలిసి 45,816 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతోపాటు, వైద్యసేవల కోసం ఏఎన్‌ఎంలను కూడా నియమించామన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు, గుర్తింపుకార్డులతో గంటన్నర ముందుగానే కేంద్రాలకు హాజరు కావాలన్నారు. హాల్ టికెట్‌లో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు ఇతర ఏవైనా తప్పులుంటే అభ్యర్థులు వారి ఒరిజినల్ 10వ తరగతి సర్టిఫికెట్, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరీక్షాకేంద్రంలో ఉండే డిపార్టుమెంటల్ ఆఫీసర్(డీఓ)కు అందజేస్తే, సవరించడానికి ఉన్నతాధికారులకు పంపే వెసులుబాటు ఉంటుందన్నారు. డీఎస్సీ పరీక్షా కేంద్రాల చిరునామా కోసం http://deoanathapuram u.blogspot.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 6న నిర్వహించనున్నట్లు జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక, ప్రణాళిక స్టాండింగ్ కమిటీ-1, వర్కులు స్టాండింగ్ కమిటీ-7, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ-2, విద్య, వైద్యసేవలు స్టాండింగ్ కమిటీ-4 సమావేశాలు జడ్పీ మెయిన్ హాల్‌లో, మహిళ, శిశు సంక్షేమం స్టాండింగ్ కమిటీ-5, వ్యవసాయం స్టాండింగ్ కమిటీ-3, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ-6 సమావేశాలు జడ్పీలోని అదనపు మీటింగ్ హాల్‌లో జరుగుతాయన్నారు. 6న ఉదయం 10.00 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు.

భూమి విషయమై రగడ.. 75 మందిపై కేసు

అనంతపురం క్రైం, జూన్4(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగర సమీపంలోని భూ వివాదాల్లో జరిగిన రెండు వేర్వేరు గొడవల్లో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 75మందిపై కేసు నమోదైంది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పరిధిలోని సర్వేనెంబరు 144/2ఏలో మొత్తం 1.76ఎకరాల్లో హనుమంతరెడ్డికి రూ.0.73సెంట్లు, సయ్యద్‌షామీర్‌కు 0.58సెంట్లు, గొల్ల విజయలక్ష్మికి 8సెంట్లు, ఇమాంబాషాకు 8సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో కాంపౌండ్‌వాల్, షెడ్డు, బోరు ఏర్పాటు చేసుకున్నారు. గత నెల 28న కొందరు వ్యక్తులు ఆ సర్వే నెంబరులోని 2ఏ మీది కాదని 2బీ ఉంటుందని దౌర్జన్యానికి దిగారు. ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీని కూల్చి వేశారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు బోయ కిష్టప్పతో పాటు 50మందిపై కేసు నమోదు చేశారు. మరో భూవివాదంలో అరవిందనగర్‌కు చెందిన వెంకటేష్‌ప్రసాద్ గుప్తా, అతని కొడుకులు ప్రణీత్, సాయినాథ్‌పై కొందరు కియ షోరూమ్ వెనుకవైపున దాడి చేశారు. ఈ ఘటనలో సాయినాథ్ చెవి పూర్తిగా దెబ్బతిందని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కోనాపురానికి చెందిన ఇంటూరి చెన్నారెడ్డితో పాటు 25మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో బాధితులు దాడికి పాల్పడిన వారిని పూర్తి స్థాయిలో గుర్తించలేకపోతున్నారని, విచారిస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. నిందితుల్లో అధికంగా టీడీపీ నాయకులు ఉన్నట్లు సమాచారం.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె నుంచి తాటిచెర్ల రైల్వే స్టేషన్ మధ్యలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. 45 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. ట్రాక్ దాటుతునే సమయంలో రైలు ఢీకొనడంతో శరిర భాగాలు చెల్ల చెదురయ్యాయన్నారు. షర్ట్ పై మాత్రం ప్రీమియర్ అని ఉందన్నారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు. వివరాలకై ఎస్‌ఐ వెంకటేష్ 9441445354, హెడ్ కానిస్టేబుల్ దామోదర్ 7013308693 లను సంప్రదించవచ్చన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి, జూన్4(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చల్లావారిపల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. బుధవారం సాయంత్రం లోకో పైలట్ విషయం చెప్పడంతో ఎస్‌ఐ అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడి వివరాలు తెలియరాలేదని ఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా వలీస్వామి ఆరాధనోత్సవం


ప్రత్యేక అలంకరణలో వలీస్వామి

అనంతపురం కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సద్గురు వలీస్వామి 14వ ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హెచ్చెల్సీ కాలనీలోని ఆశ్రమంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలో వలీస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక భజనలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రధాన కార్యదర్శి దేవనూరు సుందరం విజయ్‌కుమార్, టీసీ జయచంద్రారెడ్డి, కొండారెడ్డి, వి శ్రాంత తహసీల్దార్ నాగరాజు, నాగప్రసాద్, చంద్రశేఖర్‌బాబు, ఆనంద్‌కుమార్, రామకృష్ణ, కేఎస్ఎం నాయక్, కేపీఎస్ చలపతిరెడ్డి పాల్గొన్నారు.

వెన్నుపోటుదారుడి గ్యాంగ్ బయటకొచ్చింది : ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుదారుడు జగన్‌రెడ్డి గ్యాంగ్ మొత్తం ఒక్కసారిగా బయటకొచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను ఆయన విడుదల చేశారు. దొంగే దొంగ అన్నట్లుగా వైసీపీ నాయకుల వ్యవహారం ఉందని మండిపడ్డారు. ప్రజల తీర్పును చూసి మైండ్ బ్లాక్ అయ్యి ఏడాదిగా జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. జగన్‌రెడ్డికి మించిన వెన్నుపోటుదారుడు, కత్తిపోటుదారుడు మరెవరూ ఉండరన్నారు. ఆ పార్టీ అరాచకాలు, మోసాలను భరించలేకనే గత ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు.

వైసీపీ తీరు హాస్యాస్పదం

ప్రజలు తీర్పుఇచ్చిన రోజును వైసీపీ వెన్నుపోటు దినంగా చేయడం హాస్యాస్పదమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి ఒక ప్రకటనలో మండిపడ్డారు. అన్ని వ్యవస్థలకు వెన్నుపోటు పొడిచి, అప్రజాస్వామిక పాలన సాగించిన జగన్‌రెడ్డి వెన్నుపోటు గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఉనికి కోసం ఇలాంటి డ్రామాలు వేయడం మానుకోకపోతే.. ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని ప్రజలు భవిష్యత్‌లో వైసీపీని కనుమరుగు చేస్తారని హెచ్చరించారు.

అథ్లెటిక్ కోచ్ రఘుకు డాక్టరేట్



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ కోచ్ రఘుకు డాక్టరేట్ దక్కింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వ్యాయామ విద్యా విభాగంలో ఆచార్య ఎంవీ శ్రీనివాసన్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ డిఫరెంట్ ట్రైనింగ్ ప్రోటోకాల్స్ ఆన్ సెలెక్టెడ్ మోటార్, ఫిజికాలాజికల్ అండ్ స్ప్రింటింగ్ ఎబిలిటీస్ అమాంగ్ స్ప్రింటర్స్' అనే అంశంపై పరిశోధనకు గాను గుత్తికి చెందిన నల్లబోతుల రఘుకు డాక్టరేట్ లభించింది. కర్ణాటకలోని పలు కాలేజీలలో, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలోని అథ్లెటిక్స్‌పై పరిశోధన చేశారు. ఈయన ప్రస్తుతం బెంగుళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో అథ్లెటిక్ అసిస్టెంట్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో శాప్‌లో అథ్లెటిక్ కోచ్‌గా పనిచేసిన రఘు ఎంతో మంది క్రీడాకారులను జాతీయస్థాయిలో పతకాలు సాధించడానికి కృషి చేశారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

- రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్



రాప్తాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి వద్ద ఎస్వీఆర్ టమోటా మండీలో శుక్రవారం ఉదయం నిర్వహించే రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి నియోజకవర్గ టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీ కార మహోత్సవానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమానికి రాప్తాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

శింగనమల, జూన్4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మురళి అనే వ్యక్తికి నాగులగుడ్డం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దాసరి వెంకటరమణ ఆర్థిక సాయం అందజేశాడు. గురుగుంట్ల గ్రామానికి చెందిన నాగభూషణ కూమారుడు మురళి వారం కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వెంకటరమణ బాధితుడికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశాడు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయండి

ఆత్మకూరు, జూన్4(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పంపనూరు పార్కులో గురువారం నిర్వహించనున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం రైతులుకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తారన్నారు.

సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలి

రాప్తాడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ ఏడాది పాలనపై బుధవారం రాప్తాడులో వైసీపీ నియోజకవర్గ వైసీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాప్తాడులో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందచేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటి వరకూ కేవలం పింఛన్లు మాత్రమే పెంచారని మిగతా పథకాలు ఏవీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నార్పల : ఏడాదిలోనే ప్రభుత్వం వ్యతిరేకత మూటకట్టుకుందని శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త శైలజనాథ్ పేర్కొన్నారు. నార్పల మండల కేంద్రంలో బుధవారం వెన్నుపోటు దినం సందర్భంగా స్థానిక వాల్మీకి దేవాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, నాగరత్నమ్మ, నారాయణరెడ్డి, గోకుల్ రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.


రాప్తాడు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఊరూరా కూటమి విజయోత్సవాలు




కేక్‌కట్ చేస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ.. ముగ్గులు వేస్తున్న జనసేన నాయకురాలు పెండ్యాల శ్రీలత, పాపంపేటలో సంబరాలు

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించి ఏడాది అయిన సందర్భంగా బుధవారం జిల్లాలోని పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాల మేరకు అర్బన్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, బుగ్గయ్య చౌదరి, ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, సరిపూటి రమణ, కుంచెపు వెంకటేష్, సైఫుద్దీన్, చరిత, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి, లక్ష్మీనరసింహ, బాలాంజినేయులు, బాబాఫక్రుద్దీన్, రాజారావు, రంగాచారి, కృష్ణకుమార్, గోపాల్ గౌడ్, రమేష్, బాలకృష్ణ, బాలప్ప, నారాయణస్వామి యాదవ్, ఓంకార్‌రెడ్డి, రామకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన మొదలై ఏడాదయిందని జనసేన రాయలసీమ రీజినల్ ఉమెన్ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. ఎ.నారాయణపురం పరిధిలోని జనసేన పార్టీ మహిళా కార్యాలయ ఆవరణంలో పండుగను ప్రతిబింబించేలా వీర మహిళలతో రంగవల్లులు ఏర్పాటు చేశారు. పాపంపేట సర్కిల్ వద్ద మండల నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జింకా సూర్యనారాయణ, పవన్‌కుమార్, చల్లా జయకృష్ణ, రామాంజనేయులు, లక్ష్మీదేవి, శ్రీరాములు, పూజరప్ప, గోవిందు, సైపుల్లాఖాన్, దస్తగిరి పాల్గొన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రావి చైతన్య కిషోర్ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రజాదరణ కోల్పోవటంతో రాజకీయ లబ్ధి కోసం వెన్నుపోటు దినోత్సవం అనే కార్యక్రమాన్ని జగన్మోహన్‌రెడ్డి చేపట్టారు అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వైసీపీ నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, శశాంక చౌదరి, సూరి,హనుమప్ప చౌదరి పాల్గొన్నారు. కనగానపల్లి పరిటాల భవన్‌లో డీసీఎంఎస్, మార్కెట్ యార్డ్ చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చెన్నేకొత్తపల్లి టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామసుబ్బమ్మ, అమరేంద్ర, రామాంజి, భాస్కర్, సూర్యనారాయణరెడ్డి, దుర్గా, చెన్నకేశవులగౌడ్, అమరేంద్రరెడ్డి, హరినాథరెడ్డి, శివ పాల్గొన్నారు. జనసేన పార్టీ జిల్లా జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్ ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్‌లోని జాతీయ జెండా స్థూపంవద్ద టపాకాయలు కాల్చి సంబరాలు చేశారు. కూటమి ప్రభుత్వం పేదల బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు.అనంతపురం క్యాంపు కార్యాలయంలో కేకుకట్ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛన్ల పెంపుతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తా ఆదినారాయణ, పసువుల శ్రీరామిరెడ్డి, మాసూల చంద్రమోహన్, చెన్నయ్య, సుధాకర్, లక్ష్మీనారాయణ, చల్లానాగరాజు, బాబాఫ్రక్రుద్దిన్ పాల్గొన్నారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. పలువురు పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు.


వరుణ్‌తో కలిసి సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు


కనగానపల్లిలో కక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


బీజేపీ నాయకుడు చైనత్య కిశోర్‌కు స్వీట్లు తినిపిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు


చెన్నేకొత్తపల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తపోవనంలోని శ్రీక్షేత్రంలో జిల్లా శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీవారి దశమ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ధ్వజారోహనం, దివ్య ప్రబంధ పారాయణం, నవకలశ స్నాపనం, సుదర్శన హోమం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అలాగే వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు జ్వాలాపురం హరి, ఈఎన్‌వి రవి, అర్చకుడు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

అనంతపురం కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): లలితకళా పరిషత్ ఆవరణలో నూతనంగా నిర్మించిన వినాయక మందిరంలో గురు, శుక్రవారాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు గణపతి, శాంతి హోమాలు, శుక్రవారం ఉదయం 6 గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గణనాథుడి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ గావించడం జరుగుతుందన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో బుధవారం బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ముఖ్యఅతిథిగా హాజరై బాలింతలకు పౌష్టికాహారంతోపాటు డ్రైఫ్రూట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి మాట్లాడుతూ... ప్రభుత్వాస్పత్రిలో అనంత మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేశారని, బాలింతలు తమ మిగులు పాలను మిల్క్ బ్యాంకుకు అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మన్నీలకు కొత్త విద్యుత్ ఫీడర్


విద్యుత్ సేవలను ప్రారంభిస్తున్న ఈఈ జేవీ రమేష్

అనంతపురంరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామానికి కొత్త 11కేవీ విద్యుత్ ఫీడర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్ తెలిపారు. బుధవారం ఇటుకలపల్లి సబ్‌స్టేషన్‌లో అందుకు సంబంధించిన సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆకుతోటపల్లి ఫీడర్ కింద ఉన్న మన్నీలకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేశామన్నారు. రూ.25లక్షల వ్యయంతో మన్నిలాకు నాలుగు కిలో మీటర్ల విద్యుత్ లైన్ లాగామని అన్నారు. మన్నీలతోపాటు చియ్యేడు, కందుకూరు ప్రాంతాలకు కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు, వినియోగదారులకు విద్యుత్ పరమైన సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్4(ఆంధ్రజ్యోతి): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో చేపడుతున్న ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అటవీ శాఖ ఆధ్వర్యంలోని 14 నర్సరీలను ఎంపీడీఓలు తనిఖీచేసి, నెలరోజులుపాటు ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. నాటిన మొక్కలను దత్తత తీసుకుని, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకున్న వారితో ప్రతిజ్ఞ చేయించాలన్నారు.'కాలుష్యాన్ని నివారిద్దాం' అనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నామనీ, ఆ దిశగా ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ సలీంబాషా, జీఎస్‌డబ్ల్యు ఎస్‌కో-ఆర్డినేటర్ ధనుంజయ, డీపీఓ నాగరాజునాయుడు పాల్గొన్నారు.

హౌసింగ్ కార్యాలయం ఖాళీ..!


ఖాళీ కుర్చీలతో కనిపిస్తున్న హౌసింగ్ కార్యాలయం

అనంతపురంరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప్పరపల్లి వద్ద ఉన్న మండల హౌసింగ్ కార్యాలయం బుధవారం ఖాళీగా దర్శనమిచ్చింది. కార్యాలయంలో ఉండాల్సిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది లేక వెల..వెలబోయింది. కార్యాలయానికి వచ్చిన వారికి ఖాళీ కూర్చీలే సమాధానంగా కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై సంబంధిత ఏఈ రామకృష్ణను సంప్రదించగా..నగరంలో హౌసింగ్ ఉన్నతాధికారులు సమావేశం ఉన్నట్లు తెలిపారు. కార్యాలయంలో ఏఈతో పాటు, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ విధుల్లో ఉంటున్నారు. అందరూ సమావేశానికి వెళ్లినట్లు ఏఈ తెలిపారు. ఎలాంటి సమావేశాలున్నా..కార్యాలయంలో ఎవరో ఒక్కరైనా ఉంటారు. కార్యాలయానికి పనిమీద వచ్చేవారికి కనీసం సమాధానం చెప్పేవారు కూడా కరువయ్యారు.

నీలం సంజీవరెడ్డి స్టేడియంలో యోగాసనాలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో యోగాసనాలు వేశారు. అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి మాట్లాడుతూ నిత్యం యోగా చేయడంతో ఒత్తిడి దూరమవడంతో పాటు మనసు, శరీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందని తెలిపారు. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడు ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీవీఈఓ రమణ, పీటీసీ ప్రిన్సిపాల్ వాసుదేవన్, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, ఏఆర్ డీఎస్పీ నీలకంఠ, డీపీఆర్ఓ గురుస్వామిశెట్టి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, డాక్టర్లు లాల్యానాయక్, భాస్కర్, యోగాగురువులు కృష్ణవేణి, గురురాజారావు, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే దగ్గుపాటి సాయం మరువలేను'

అనంతపురం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తాను ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వైద్యచికిత్సలు అందించడంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చేసిన సాయం ఎన్నటికీ మరువలేనని టీడీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే వెంకటేశులు పేర్కొన్నారు. బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న వెంకటేష్ బుధవారం అనంతపురం నగరంలోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. అనంతపురం అర్బన్ మినీమహానాడులో తాను వ్యక్తిగత కారణాలతో క్షణికావేశంలో పురుగుల మందు తాడి ఆత్మహత్యాయత్నం చేసుకున్నానన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి రూ.5 లక్షలు దాకా ఖర్చు చేసి, బెంగళూరులో మెరుగైన చికిత్సలు అందించి కాపాడారని, తాను, తన కుటుంబం రుణపడి ఉంటామన్నారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన జేసీ

అనంతపురంరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట నందుగల చౌకధాన్యపు డిపోలను జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ బుధవారం తనిఖీ చేశారు. గ్రామంలోని రేషన్ దుకాణాలు 54, 57ను పరిశీలించారు. మండలంలో రేషన్ సరఫరా తక్కువ ఉండటంతో దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో స్టాక్ వివరాలను పరిశీలించారు. స్టాక్ ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉండటంతో 6ఎ కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సరుకును వీఆర్వోకు స్వాధీనం చేశారు. ఇదే క్రమంలో డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సరఫరా చేసే రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సీఎస్‌డీటీ రామకృష్ణ, వీఆర్వో రాజేశ్వరి పాల్గొన్నారు.


డీలర్‌తో మాట్లాడుతున్న జేసీ శివనారాయణ్ శర్మ

● రాప్తాడు : ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ నుంచి చౌక దుకాణాలకు నిత్యవసర సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. మండలంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గోడౌన్ నిత్యావసర సరుకులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలో నిత్యావసర సరుకులు రవాణా చేయాలన్నారు. ఆలస్యమైతే చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్‌కు హమాలీలు నిర్ణీత సమయంలో హాజరై సమయానుగుణంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బయాలజీ, ఎన్‌సీసీ ఖాళీ చూపాలి

- డీఈఓకు ఉపాధ్యాయుడి వినతి

అనంతపురం విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తూరు బాయ్స్ స్కూల్, పాతూరు నెంబర్- 2 స్కూల్‌లో బయాలజీ ఆర్మీ ఖాళీ చూపాలని ఉపాధ్యాయుడు నాగేంద్ర డీఈఓ ప్రసాద్‌బాబును కోరారు. బుధవారం ఆయన డీఈఓకు వినతి పత్రం అందించారు. కొత్తూరు బాయ్స్ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ గణితం వేకెన్సీ లేనప్పటికీ మరో ఎన్‌సీసీ ఆఫీసర్ కోసం వెబ్ ఆప్షన్లలో డిస్‌ప్లే చేశారని పేర్కొన్నారు. అదే విధంగా కళ్యాణదుర్గం గవర్నమెంట్ స్కూల్‌లో కూడా గణితం వేకెన్సీ ఉన్నట్టు డిస్‌ప్లే అవుతోందన్నారు. దీని వల్ల ఇద్దరు ఎన్‌సీసీ ఆఫీసర్లు ఒకే యూనిట్‌కు అలాట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. కొత్తూరు బాయ్స్ స్కూల్ పనిచేస్తున్న తనకు ఇదే స్కూల్‌లో బయాలజీ ఆర్మీ వేకెన్సీ ఉన్నప్పటికి ఆప్షన్ డిస్‌ప్లే కావడం లేదన్నారు. పాతూరు నెంబర్ -2 స్కూల్‌లో సైతం బయాలజీ ఎన్‌సీసీ వేకెన్సీ చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తూరు బాయ్స్ స్కూల్‌లో లేదా నెంబర్ 2 స్కూల్‌లో బయాలజీని ఎన్‌సీసీ ఆర్మీగా వేకెన్సీ చూపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చీనీ కాయలు టన్ను రూ.32వేలు

అనంతపురంరూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.32,150, కనిష్టంగా రూ.3వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 595 టన్నుల చీనీ కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

ఢిల్లీలో జరిగే పర్యావరణ సదస్సుకు మేయర్

అనంతపురం క్రైం, జూన్4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం న్యూఢిల్లీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక రోజు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు నగర మేయర్ మహమ్మద్ వసీం హాజరు కానున్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు.

వనమహోత్సవానికి వేళాయె..

నేడు పంపనూరు నగరవనంలో కార్యక్రమం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పంపనూరు నగరవనంలో వనమహోత్సవం నిర్వహించనున్నారు. అందుకు సంబం ధించి అటవీశాఖ అధికారులు సర్వ సిద్ధం చేశారు. జిల్లాలో 3.85 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. అందులో భాగంగా జి ల్లాలోని సామాజిక వనవిభాగం ఆధ్వర్యంలోని 14 నర్సరీల్లో 12.25 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచారు. సాయంత్రం సీఎఫ్ యశోదాబాయి నగరవనాన్ని తనిఖీ చేశారు. వనమహోత్సవ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అటవీక్షేత్రాధికారులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, సెక్షన్ ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్, అక్బర్, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పశువులను గోశాలకు తరలించండి

శింగనమల జూన్ 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కేంద్రం శింగనమల రోడ్లపై పశువులు ఉడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే అధికారులు పశువులను గోశాలకు తరలించాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధి డైరెక్టర్ ఎం.ఆదినారాయణ అధికారులకు తెలిపారు. బుధవారం శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఎంపీడీఓ ఆలస్యం వల్లన 10 గంటకు ప్రారంభం కావలసిన సమావేశం 12 గంటలకు ప్రారంభమయింది. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గం కేంద్రం శింగనమలలో ఆవులను ఇష్టారాజ్యంగా రోడ్లు మీద రాత్రి పగలు వదిలేస్తున్నారని దాంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అధికారులు గోశాలకు తరలించాలని అన్నారు. పశువైద్యాశాఖ అధికారి కిరణ్‌కూమార్ మాట్లాడుతూ రైతులు తమకు సంబంధించిన ఆవులకు ట్యాగులు వేయించుకోవాలని, అప్పుడు వారికి అప్పగిస్తామని లేని పక్షంలో గోశాలకు తరలిచాడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జూలాకాలువ సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడుతూ రీసర్వేలో తన భూమి పట్టాదారు పుస్తకంలో తన తండ్రి పేరు ముస్లిం వ్యక్తి పేరుతోపాటు ఫొటో తప్పుగా రావడంతో మూడు సవంత్సరాలుగా అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లినా ఇంత వరకు మార్పులు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, సీడీపీఓ ఉమాశంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

హామీలు అమలు చేయాల్సిందే

గుంతకల్లు టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వెన్నుపోటు దినం సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు వైసీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

● ఉరవకొండ : టీడీపీ ఏడాది పాలనలో పింఛన్ తప్పా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. పట్టణంలో బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేరుతో స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు.

● రాయదుర్గంరూరల్ : కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని వైసీపీ పార్టీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా వినాయకసర్కిల్ నుంచి లక్ష్మీబజార్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

రేపు వాహనాల వేలం

విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఉదయం పది గంటలకు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలం వేస్తున్నట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చెల్లించాలన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

రాయదుర్గం రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి.. ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షుడు శశికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హైస్కూల్ వద్ద మాట్లాడుతూ.. పుస్తకాలు, యూనిఫాం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవనీత్, మాంతేష్, నవీన్, మల్లికార్జున పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

బొమ్మనహాళ్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వికాస్ కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన సదస్సు బుధవారం మండలంలోని దేవగిరి, గోవిందవాడ, దర్గాహొన్నూరు గ్రామాల్లో నిర్వహించారు. కళ్యాణదుర్గం కేవీకే కో-ఆర్డినేటర్, శాస్త్రవేత్త చంద్రాయుడు, రాయదుర్గం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మీనాయక్ ఖరీఫ్‌లో సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సాయికుమార్, టీడీపీ నాయకుడు అప్పారావు పాల్గొన్నారు.

● యల్లనూరు: ఆధునిక పద్ధతుల్లో సాగు వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త భార్గవి తెలిపారు. మండలంలో బుధవారం వెన్నపూసపల్లి, నిట్టూరు గ్రామాల్లో కృషి వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పప్పుశనగ, చిక్కుడు, కంది, పంటలో వచ్చిన నూతన వంగడాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● పెద్దపప్పూరు: స్థానిక వ్యవసాయకేంద్రం వద్ద వ్యవసాయశాఖ అధికారులు వికసిత్ కృషి సంకల్ప అభిమాని కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో రెడ్డిపల్లి, రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కసాపురంలో ఏసీల మరమ్మతులకు చర్యలు

గుంతకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని వసతి గదుల్లో ఏసీలు పని చేయడం లేదు. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం 'శిథిల సదనాలు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. స్పందించిన దేవదాయ అధికారులు రామదూత నిలయంలో పనిచేయని ఏసీల మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. మెకానిక్‌ను పిలిపించి, ఏసీల మరమ్మతులకు అంచనా వేయించారు.

కంటి వైద్య శిబిరం

శెట్టూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో శాంతిరాం ఆస్పత్రి సహకారంతో బుధవారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు గురుప్రసాద్, నగేష్ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు శిక్షణ

బ్రహ్మసముద్రం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, నాయకత్వ లక్షణాలు తదితర వాటిపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసింబీ, ఏఎన్ఎం నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, శాంతమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి

తాడిపత్రి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీకట్ట వద్ద ఉన్న స్నేహభారతి సంగీత శిక్షణాలయంలో బుధవారం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని నిర్వహించారు. మహేష్‌స్వామి, రామకృష్ణ, పాండురంగయ్య, శ్యామల, శివ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఎమ్మెల్యే అమిలినేని కారు


దెబ్బతిన్న ఎమ్మెల్యే కారు

కళ్యాణదుర్గం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి కళ్యాణదుర్గానికి ఎమ్మెల్యే అమి లినేని సురేంద్రబాబు కారులో బుధవారం వస్తుండగా కర్ణాటకలోని బాగేపల్లి వద్ద ఆయన కారు ప్రమాదవశాత్తు ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఎమ్మెల్యే సురక్షితంగా బయటప డ్డారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ప్రముఖులు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పీటర్

కూడేరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌సీసీ నగర్‌లో ఆంధ్ర గర్ల్స్ ఆరో బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ప్రారంభమైంది. బుధవారం క్యాంపును కర్నూలు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డీఎస్ పీటర్ విద్యార్థులకు ఫైరింగ్, డ్రాయింగ్, వ్యాయమం, మ్యాప్ రీడింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. క్యాంపునకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. శిక్షణలో కెప్టెన్ శారద, సంగీత, శశికళ పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పరిశీలన

పెద్దవడుగూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పేచర్ల రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసే వేరుశనగ కాయలను అంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటివద్దకే రేషన్ పంపిణీపై ఆరా

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమంపై తాడిపత్రి ఇన్‌చార్జ్ ప్రత్యేక ఉప కలెక్టర్ మల్లికార్జునుడు బుధవారం ఆరా తీశారు. స్థానిక దళితవాడలోని ఈరమ్మ ఇంటివద్దకు వెళ్లి వస్తువుల రేషన్ సరుకుల పంపిణీపై విచారించారు. ఆయన వెంట తహసీల్దార్ ఉషారాణి, ఆర్ఐ లహరిక ఉన్నారు.

'సేవ్ ఆర్డీటీ' పేరుతో వైసీపీ పాదయాత్ర


బ్రాహ్మణపల్లి తండాలో పాదయాత్ర చేస్తున్న వైసీపీ నాయకులు

బెళుగుప్ప, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సేవ్ ఆర్డీటీ పేరుతో వైసీపీ మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్రను మండలంలోని బ్రాహ్మణపల్లి తండా నుంచి ప్రారంభించారు. కాగా, ఈ పాదయాత్రకు అనుమతులు లేవని పోలీసులు అడ్డుకున్నారు. ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత అని, దీనికి అనుమతులు ఎందుకని వైసీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, రవిబాబుతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పాదయాత్ర చేపట్టారు. మొదట రోజు ఈ యాత్ర బ్రాహ్మణపల్లి తండా, బ్రాహ్మణపల్లి, నరసాపురం గ్రామాల మీదుగా ఎనిమిది కిలోమీటర్లు కొనసాగింది. నాయకులు ఉమామహేశ్వరనాయుడు, గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, విప్ వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, తిప్పేస్వామి ఇందులో పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ ఆపింది వైసీపీనే

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

ఆర్డీటీ సమస్య గురించి తెలుసుకో రంగయ్యా..!

కళ్యాణదుర్గం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌ను చేయకుండా 2021లోనే నాటి వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని, ఆ విషయాన్ని మాజీ ఎంపీ తలారి రంగయ్య తెలుసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హితవుపలికారు. కంబదూరు మండలంలోని కదిరిదేవరపల్లి రైల్వేస్టేషన్‌లో కదిరిదేవరపల్లి - తిరుపతికి వెళ్లే రైలును బుధవారం పునఃప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌ను వైసీపీ ప్రభుత్వం ఆపేసినప్పుడు నోరు మెదపని రంగయ్య.. నేడు కళ్యాణదుర్గంలో ఆర్డీటీ సంస్థను అడ్డం పెట్టుకుని రాజకీయం చేసి.. ఆర్డీటీ పరువు, ప్రతిష్ఠలను బజారుకు ఈడుస్తున్నారని మండిపడ్డారు. వెన్నుపోటుకు కేరాఫ్ అయిన జగన్‌రెడ్డే కూటమి ప్రభుత్వంపై వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్‌కు నాటి మంత్రి ఉషశ్రీచరణ్ కనీస మర్యాద కూడా ఇచ్చేది కాదని, కాని తాను మున్సిపల్ చైర్మన్‌కు తన ప్రక్కనే కుర్చీ వేసి గౌరవం ఇచ్చినా పట్టణం అభివృద్ధికి అడ్డు తగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వైసీపీ నాయకులు కూడా అభివృద్ధిని అడ్డుకుంటూ, పలుచోట్ల పైప్‌లైన్ పగులకొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● కళాశాలల భవన నిర్మాణానికి..: నియోజకవర్గంలో కుందుర్పి, కంబదూరు, శెట్టూరు, కళ్యాణదుర్గంలో కేజీబీవీ జూనియర్ కళాశాలల భవనాల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.1.60 కోట్ల ప్రకారం.. రూ.6.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఎస్‌వోలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


ర్యాలీలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా టీడీపీ విజయోత్సవ ర్యాలీ

తాడిపత్రి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జేసీ నివాసానికి చేరుకొని అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నెవారిపల్లికాలనీ నుంచి జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల రోడ్డులో నుంచి భారీగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, మోటాటి పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, జగన్నాథరెడ్డి, కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున్, షెక్షావలి పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ


గుంతకల్లులో ముగ్గులను పరిశీలిస్తున్న నేతలు

గుంతకల్లుటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది అయిన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి స్థానిక అజంతా సర్కిల్‌లో టపాసులు పేల్చి సంబరాలు చేశారు. ఇందులో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ బాధ్యుడు వాసిగిరి మణికంఠ పట్టణ అధ్యక్షుడు బండిశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, టీడీపీ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, బీజేపీ సీనియస్ నాయకులు హరిహరనాథ్, విశ్వనాథ్, శ్రీదేవి, గుర్రం సూర్యనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

వెన్నుపోటు కాదిది.. విమోచన దినోత్సవం



గుంతకల్లులో దళిత ఐక్య వేదిక నాయకుల సంబరాలు

గుంతకల్లుటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినం కాదని.. వైసీపీ పాలన నుంచి దళితులకు నిజమైన విమోచన దినోత్సవం అని దళిత ఐక్యవేదిక నాయకులు ఎల్లిపాయల ఆనంద్ అన్నారు. పట్టణంలో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు జింకల జగన్నాథ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి వెంకటేష్, నాయకులు అరుణ్‌కుమార్, బబ్లు, రాజు, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

అరాచక పాలన నుంచి విముక్తి


పాల్తూరులో టీడీపీ నాయకుల సంబరాలు

విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి పొంది సంవత్సరమైందని టీడీపీ మండల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. అలాగే పాల్తూరు, గడేకల్లు, వివిధ గ్రామాల్లో నిర్వహించిన సంబరాల్లో టీడీపీ నాయకులు నూర్, డీ దొడ్డయ్య, కే నగేష్, బీ రాధస్వామి, బీ మారయ్య పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో సంబరాలు

ఉరవకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ గౌతమ్, నాయకులు చంద్రశేఖర్, కేశవ, నగేష్, దేవేంద్ర, రమేష్, మణికుమార్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

విషాదం మిగుల్చుతున్న ఈత సరదా


యాటకల్లు సమీపంలోని క్వారీ గుంతలో పడి మరణించిన దర్శిని, జయంతి (ఫైల్)

కళ్యాణదుర్గం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా ఈతకెళ్లిన బాల బాలికలు అనుకోకుండా జరిగిన సంఘటనల్లో మృత్యువాత పడుతున్నారు. వారి కుటుంబాలకు విషాదం మిగుల్చుతున్నారు. చేతికొచ్చిన పిల్లలు చనిపోవడం తల్లిదండ్రులు గుండెకోతకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఇలా ఉన్నాయి ..

● మార్చి 9న కుందుర్పి ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విష్ణు నీటిలో మునిగి చనిపోయాడు. అతన్ని రక్షించేందుకు వెళ్లిన మరో యువకుడు కూడా నీటిలో మరణించాడు.

● మార్చి 11న కళ్యాణదుర్గం మండలం నారాయణపురానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి దర్శిత్ మిత్రులతో కలిసి ఈతకెళ్లి మరణించాడు.

● మార్చి 29న కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురానికి చెందిన కార్తీక్ అనే విద్యార్థి గ్రామ సమీపంలోని పెన్నా పరివాహక ప్రాంతంలో ఈతకెళ్లి మరణించాడు.

● ఏప్రిల్ 28న శెట్టూరు మండలం యాటకల్లు సమీపంలోని క్వారీ గుంతలో పడి బాలికలు దర్శిని (6), జయంతి (16) మరణించారు.

● ఏప్రిల్ 30 గుమ్మఘట్ట మండలం బేలోడుకు చెందిన బీటీపీ ఎడమ కాలువలో ఆడుకునేందుకు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు.

అప్రమత్తంగా ఉండాలి



గ్రామాల్లో పిల్లలు ఈతకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వారిని ఒంటరిగా ఈతకు పంపరాదు. పిల్లల వెంట ఉంటూ.. వారిపై నిఘా ఉంచాలి. వీటిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

-రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఫ్లై ఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

యాడికి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో యాడికి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం స్థల పరిశీలన చేశారు. ఇందులో రైల్వేకు సంబంధించిన భూమి ఎంత ఉంది.. ప్రభుత్వ భూమి ఎంత ఉంది.. పట్టా భూములు ఎంత ఉన్నాయి అనే వివరాలను స్థానిక అధికారుల నుంచి ఆరాతీశారు. ఇందులో సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శశిభూషణ్, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ, ఏఈ హనీఫ్, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వోలు కుమారస్వామి, శ్రావణ్ పాల్గొన్నారు.

రెండేళ్లుగా నిర్లక్ష్యం..!



మారని అధికారుల పేర్లు

కంబదూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటారెడ్డిపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో రెండేళ్ల క్రితం బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లే నేటికీ ఉన్నాయి. ఎంపీడీఓ శివారెడ్డి, విస్తరణ అధికారి పద్మ.. ఈ ఇద్దరు అధికారులు రెండేళ్ల క్రితమే బదిలీపై వెళ్లారు. కాని ఇంతవరకు వారి పేర్లను తొలగించి.. ప్రస్తుత అధికారుల పేర్లను నమోదు చేయలేదు. సచివాలయ సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో దీన్ని బట్టి చూస్తే ఇట్టే అర్థం అవుతోంది.

పెచ్చులూడుతున్న గ్రంథాలయ భవనం



కుందుర్పి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని సంవత్స రాలుగా భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి పాఠ కుల మీద పడుతున్నాయి. పాఠ కులు ఎప్పుడు పెచ్చులు పడతాయోనని బిక్కు బిక్కుమంటూ చదువుకోవాల్సి వస్తోంది. ఇక వర్షా కాలం వస్తే.. పుస్తకాలన్నీ తడిసిపోతున్నాయి. అధి కారులు గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వేపచెట్టు కూల్చివేత



యాడికి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): యాడికి-నిట్టూరు రహదారి పక్కన ఉన్న భారీ వేప చెట్టును బుధవారం కొందరు స్వార్థప్రయోజనాల కోసం నిప్పుపెట్టి కూల్చివేశారు. వాహనదారులు, పాదచారులకు నీడ ఇచ్చే.. ఈ చెట్టును కూల్చివేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే ఇలా చెట్టును కూల్చివేయడంపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా చెట్లను కూల్చివేస్తున్న వారిపైచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గో సంరక్షణ అందరి కర్తవ్యం

తాడిపత్రి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ అందరి కర్తవ్యమని విశ్వహిందూ పరిషత్ తాడిపత్రి ప్రఖండ కార్యదర్శి లింగుట్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ.. గోవధ నిషేధం పశు సంరక్షణ చట్టం ప్రకారం గోవులను, దూడలను చంపరాదని, ఎలాంటి పశువులనైనా వధించాలంటే ప్రభుత్వ పశువైద్యుని ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గౌరీశంకర్, లోకేష్‌రెడ్డి, రామనాథ్, హనుమంతరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

● రాయదుర్గం రూరల్: గోరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ రాయదుర్గం శాఖ అధ్యక్షుడు దేవరెడ్డిపల్లి రాజేష్ అర్బన్ సీఐ జయనాయక్, రూరల్ సీఐ వెంకటరమణకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. గోవుల అక్రమ రవాణా చేస్తున్నా... వధించినా.. ప్రజలు వెంటనే పోలీసులకు గాని.. డయల్ 100కుగాని.. విశ్వహిందూ పరిషత్ దృష్టికి గాని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు మద్దిలేటి సత్యనారాయణ, మాదుగొండే మల్లికార్జున పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


ఉమేష్ (ఫైల్)

కుందుర్పి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన రైతు ఉమేష్ (48) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను తన భార్య లక్ష్మీదేవితో కలిసి బైక్‌పై కర్ణాటక ప్రాంతం చెళ్లకెరకు వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో చెళ్లకెర - పరశురాంపురం గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమేష్ అక్కడికక్కడే మరణించాడు. లక్ష్మీదేవికి స్వల్ప గాయాలయ్యాయి. ఉమేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చత్తీస్‌ఘడ్ వాసి..

ఉరవకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌకుంట్ల గ్రామ సమీపంలో బోర్‌వెల్ వాహనం బోల్తా పడటంతో చత్తీష్‌ఘడ్‌కు చెందిన కార్మికుడు శివకుమార్(20) మరణించాడు. ఆ వాహనం రాంపురం వైపునకు వెళ్తుండగా కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న శివకుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి


గాయపడ్డ రంగయ్య

పెద్దవడుగూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాలగుత్తి గ్రామంలో బుధవారం టీడీపీ కార్యకర్త రంగయ్యపై వైసీపీకి చెందిన రంగస్వామి, ఓబులపతి, రమేష్, లాలెప్ప, ఓబులేసు దాడి చేశారు. దీంతో రంగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నపిల్లల విషయంలో ఇరువురు ఘర్షణ పడడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. గాయపడిన రంగయ్యను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హౌస్ అరెస్ట్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం పలు వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారు. సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటనరసింహులు కార్లను తనిఖీ చేసి.. ఇరువర్గాల నాయకులు వెళ్లకుండా ఆపేశారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కాలవ భరత్

ముగిసిన క్రికెట్ టోర్నీ

బొమ్మనహాళ్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్‌లో వారం నుంచి నిర్వహిస్తున్న కాలవ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఈ టోర్నమెంటులో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ లో ఉద్దేహాళ్ లెజండ్, గోనేహాళ్ సినియర్ జట్లు తలపడగా.. ఉద్దేహాళ్ జట్టు విజేతగా నిలిచింది. ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి విజేత జట్టుకు రూ. 30 వేలు, రన్నర్ జట్టుకు రూ. 15 వేలు నగదు, ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, టీడీపీ నాయకులు కొత్తపల్లి అరుణ్, నవీన్, సైకిల్‌షాప్ హనుమంతు, రవిచంద్రసాగర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

పుట్లూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ శేషారెడ్డి కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బుధవారం బదిలీ అయ్యారు. ఈయన గతేడాది నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. మండలానికి ఇంకా ఎవరిని నియమించలేదు.

పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

యల్లనూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి యాడికికి వెళ్లకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు తిమ్మంపల్లి గ్రామంలో బుధవారం ఉదయం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, పెద్దారెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి తనను ఒకరినే హౌస్ అరెస్ట్ చేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారని పెద్దారెడ్డి పోలీసులను ప్రశ్నించారు. తాను ఎలాగైనా వెళ్లి తీరుతానని అనుచరులతో కలిసి నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ సమయంలో డీఎస్పీ, రూరల్ సీఐ సత్యయేసుబాబు తమకు సహకరించాలని కోరారు. ఎస్పీతో మాట్లాడించి, నోటీసు ఇప్పిస్తేనే తాను ఇంటికి తిరిగి వెళ్తానని పెద్దారెడ్డి తెల్చిచెప్పారు. ఎక్కడబడితే అక్కడ నోటీసు ఇవ్వరాదని, తమకు సహకరించాలని డీఎస్పీ పదేపదే కోరడంతో పెద్దారెడ్డి అనుచరులతో కలిసి ఇంటికి వెళ్లారు.